ప్రజాశక్తి
గురువారం 24 అక్టోబర్ 2024
5
పార్వతీపురం మన్యం

విద్యార్థినిపై అత్యాచారం

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

పార్వతీపురం పట్టణ పరిధిలో బెలగాం శివారులో ఉన్న ఏకలవ్య పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థినిపై అత్యాచారం జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది.. బుధవారం డయల్ 100కు సమాచారం రావడంతో పార్వతీపురం పట్టణ సిఐ, ఎస్ఐ, మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్ఐ.. పాఠశాలకు చేరుకుని, విచారణ చేపట్టారు. గుమ్మలక్ష్మీపురం మండలానికి చెందిన ఆ బాలిక ఈనెల 21న బొబ్బిలి వెళ్లింది. ఈనేపథ్యంలో పట్టణానికి చెందిన యువకుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. యువకుడిని బొబ్బిలి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ప్రజలను తప్పుదారి పట్టిస్తున్న ఎంఎస్‌పి

ఆదివాసీలు, రైతులతో సమావేశమైన వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు

- గ్రానైట్ కంపెనీ అనుమతులు రద్దుచేయాలి
- వామపక్షాలు, ప్రజా సంఘాల నాయకుల డిమాండ్
- బడిదేవర కొండపై గ్రానైట్ తవ్వకాలు పరిశీలన
- ఆదివాసీలు, రైతులతో సమావేశాలు

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

బడిదేవరకొండపై ఎంఎస్‌పి కంపెనీ తవ్వకాలకు ప్రభుత్వం ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని వామపక్ష పార్టీల, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని బడిదేవరకొండపై చేపడుతున్న గ్రానైట్ తవ్వకాలను వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కొండ సమీపంలో ఉన్న గ్రామాల్లో ఆదివాసీలు, రైతులతో సమావేశమయ్యారు. వారంతా గ్రానైట్ తవ్వకాలను తీవ్రంగా వ్యతిరేకించారు. ఆ కొండపై తమ జీవనాధారం ఆధారపడి ఉందని, పోడు, బంజరు భూములు సాగు చేసుకుంటున్నామని ఆదివాసీలు తెలిపారు. 30 గ్రామాల్లో ఈ కొండ ఊట, గెడ్డల ద్వారా పది వేల ఎకరాల్లో పంట పండిస్తున్నారని తెలిపారు. గ్రానైట్ తవ్వకాలు చేపడితే తమ వ్యవసాయం తీవ్రంగా దెబ్బతింటుందని రైతులు నాయకుల ఎదుట ఆందోళన వ్యక్తంచేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ మాట్లాడుతూ బడిదేవరకొండలో సుమారు 42 ఎకరాల్లో గ్రానైట్ తవ్వకాలకు ఎంఎస్‌పి కంపెనీకి 20 ఏళ్లపాటు లీజుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందన్నారు. ఈ అనుమతులను సమీప గ్రామాలకు చెందిన ప్రజలందరూ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. మైనింగ్ శాఖ ఎడి ఎటువంటి అనుమతీ ఇవ్వలేదని, లీజు ప్రభుత్వం ఇచ్చిందని, పర్యావరణ అనుమతులు కూడా ఇచ్చినట్లు ఆ అధికారి ద్వంద ప్రకటన చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కంపెనీకి అనుకూలంగా కిరాయి మనుషులతో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారని మండిపడ్డారు. ఈ విషయంపై ఆయా గ్రామస్తులను విచారించగా, బడిదేవరకొండ పరిసర గ్రామాల నుంచి ధర్నాకు ఎవరూ వెళ్లలేదని చెప్పారని వెల్లడించారు. ఎంఎస్‌పి కంపెనీ కిరాయి ధర్నా మానుకోవాలని, ఈ కంపెనీకి ప్రభుత్వం ఇచ్చిన అన్ని రకాల అనుమతులు తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాభిప్రాయ సేకరణ కూడా చేపట్టాలని కోరారు. త్వరలో వామపక్షాలు, ప్రజాసంఘాలు కలిసి గ్రానైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి, ఐక్య కార్యాచరణ కమిటీ ఏర్పడుతుందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, సిపిఐ జిల్లా కార్యదర్శి కోరంగి మన్మథరావు, అఖిల భారత రైతుకూలీ సంఘం నాయకులు బొత్స నర్సింగరావు, మోనంగి భాస్కరరావు, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్ కుమార్, చెరువుల సంరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి పకీరు నాయుడు, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఆర్‌విఎస్ కుమార్, ఎవైఎఫ్ నాయకుడు గోపి నాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు పి.రాము, జాతీయ గ్రామీణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.సంఘం, తదితరులు పాల్గొన్నారు.


బడిదేవరకొండపై తవ్విన గ్రానైట్ రాయిని పరిశీలిస్తున్న వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు

తుపాను పట్ల అప్రమత్తం

అధికారులంతా అందుబాటులో ఉండాలి : కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

ప్రజాశక్తి-పార్వతీపురం

తుపాను నేపథ్యంలో జిల్లా అధికారులందరూ అప్రమత్తం కావాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. ఉత్తరాంధ్రలో తుపాను మూలంగా గురువారం నుంచి జిల్లాలో ఈదురుగాలులతో పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు జిల్లా, మండల అధికారులు అప్రమత్తం కావాలని తెలిపారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి టెలీ కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో ఆయన సమీక్షించారు. ఎప్పటికప్పుడు వర్షాలు, వరదల పరిస్థితిని గమనించాలని, మట్టి ఇళ్లు, శిథిలావస్థలో ఉన్న భవనాలలో నివశించే వారిని సురక్షిత భవనాల్లోకి మార్చాలని ఆదేశించారు. గర్భిణులు, వృద్ధులను వసతిగృహాలకు తరలించాలని తెలిపారు. వర్షాలు, వరద పరిస్థితులపై ప్రజలకు సమాచారం అందించాలని, లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులూ రాకుండా ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. నదులు, వాగులు, వంకలు, చెరువులను ఎవరూ దాటకుండా, దిగకుండా సూచించాలన్నారు. ప్రమాదకర ప్రదేశాల్లో సిబ్బందిని ఏర్పాటుచేసి, సూచనల బోర్డులను ఉంచాలన్నారు. విపత్తులు సంభవించే అవకాశాలు ఉన్న ప్రదేశాలు వద్ద పూర్తి అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

విపత్తుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. చీకటి ప్రదేశాల్లో ఫ్లడ్‌లైట్స్ వినియోగించాలన్నారు. గెడ్డలు, వాగులు, వంకలు పొంగే ప్రదేశాలు, ఆకస్మికంగా వరదలు వచ్చే సమయంలో వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురికాకుండా పోలీసు, వాలంటీర్లు, ఇతరులను ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని సూచించారు. జల వనరుల శాఖ వివిధ రిజర్వాయర్లలో నీటి పరిస్థితి, నీటి ప్రవాహ పరిస్థితి ఎప్పటికప్పుడు గమనించి సమాచారాన్ని అందించాలని ఆదేశించారు. వర్షాలు, వరదల వల్ల తాగునీరు కలుషితం కాకుండా చూడాలని సూచించారు. అధికారులంతా సమన్వయం చేసుకొని ఎక్కడా ఎటువంటి నష్టమూ జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

పార్వతీపురం కమిషనర్‌గా శ్రీనివాసరాజు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

మున్సిపల్ కార్యాలయంలో ఉన్న కమిషనర్ కె.శ్రీనివాస్ ఈ నెల నాలుగో తేదీన బదిలీపై వెళ్లారు. దీంతో ఇన్‌ఛార్జి కమిషనర్‌గా ఎఇ సన్యాసిరావు విధులు నిర్వహిస్తున్నారు. పూర్తి స్థాయి కమిషనర్ లేకపోవడంతో కార్యాలయ ఉద్యోగుల జీతాలు, బిల్లులు పెట్టేందుకు అవకాశం లేకపోవడంతో జాప్యం జరిగింది. ఇటీవల బదిలీపై జివిఎంసి నుంచి వచ్చిన డిఇ జి.శ్రీనివాసరాజును ఎఫ్ఎసి కమిషనర్‌గా నియమించినట్లు డిఎంఎ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. దీంతో శ్రీనివాసరాజు పూర్తిస్థాయి కమిషనర్‌గా బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయనతోపాటు టిపిఒగా పి.ప్రమీల రాణి, ఇంజనీరింగ్ విభాగంలో ఎఇగా కె.అప్పారావు బాధ్యతలు చేపట్టారు.

కమిషనర్ శ్రీనివాసరాజు

ఆర్ఓఎఫ్ఆర్ భూములు నమోదుకాకే

ఇ-క్రాప్ నమోదు చేయకపోవడంపై ఎఒ వివరణ • పత్తి రైతులకు ప్రభుత్వ రాయితీలు కష్టమే

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

మండలంలో వ్యవసాయాధికారులు ఇ-క్రాప్ నమోదు వరి పంటకే పరిమితం కావడంతో, పత్తి పండించిన గిరిజనులకు నష్టం వాటిల్లిందని మంగళవారం మండల సర్వసభ్య సమావేశంలో ఎఒ నిలదీసిన విషయం తెలిసిందే. దీనిపై బుధవారం 'ప్రజాశక్తి'లో ఇ-క్రాప్ సక్రమంగా లేక రైతులకు నష్టాలు.. అనే శీర్షికతో వచ్చిన కథనానికి జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్ పాల్, ఎంపిడిఒ కె.రూపేష్‌కుమార్ స్పందించారు. వారి ఆదేశాలతో ఎఒ అశోక్.. రావికోన సర్పంచ్ రామస్వామితో కలిసి బుధవారం పత్తి పండించిన రావికోన, బట్టివలస, రంగాలగూడ గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ గిరిజనులు సాగు చేస్తున్న ఆర్ఓఎఫ్ఆర్ భూములు గిరిభూమి యాప్‌లో నమోదు కాలేదని తెలిపారు. దీంతో ఈ ఏడాది ఇ-క్రాప్ చేయలేదని చెప్పారు.

ఈ విషయం గిరిజనులకు వివరించామని తెలియజేశారు. ఆర్ఓఎఫ్ఆర్ భూముల్లో సాగు చేసుకుంటున్న పంటల వివరాలను నమోదు చేసుకున్నామని, ఇంకా ఎవరైనా ఉంటే తమ భూముల వివరాలను అందించాలని కోరారు. వాటన్నిటిని గిరిభూమి యాప్‌లో నమోదు చేస్తామన్నారు. వచ్చే ఏడాది తప్పకుండా ఇ-క్రాప్ చేసి, ఇ-కెవైసి నిర్వహించి, ఆ భూములలో పండించే అన్ని రకాల పంటల వివరాలను నమోదు చేస్తామన్నారు. తద్వారా ప్రభుత్వం అందించే అన్ని రకాల రాయితీలు, నష్టపరిహారాలు అందేటట్లు చూస్తామని చెప్పారు.

ఇ-క్రాప్ నమోదు కాని పత్తి పంటను పరిశీలిస్తున్న ఎఒ అశోక్

ఇసుక దోపిడీ

నాగావళి నది నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు

చిన్నమంగళాపురం నుంచి అక్రమ రవాణా

ప్రజాశక్తి-పాలకొండ

నాగావళి నది నుంచి ఇసుక దర్జాగా రవాణా అవుతోంది. రాత్రి, పగలూ తేడా లేకుండా అడ్డూ అదుపూ లేకుండా ఇసుక అక్రమ తవ్వకాలు చేపడుతున్నారు. ముఖ్యంగా నాగావళి నది తీర గ్రామాల నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. మండలంలో చిన్నమంగళాపురం ప్రాంతం నుంచి ఇసుక తవ్వకాలు పట్టపగలే చేపడుతున్నారు. ఓ వైపు నాగావళి వంతెన అతి సమీపంలో ఉండగా, మరోవైపు రక్షిత మంచినీటి పథకం ట్యాంకు అతి సమీపంలో ఉంది. దీంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. నాగావళి నది నుంచి రోజుకు 50 నుండి 70 ట్రాక్టర్ల వరకు ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. దీనిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు కూడా చూసీ చూడని ధోరణిలో వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇసుక అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పినప్పటికీ ఈ మండలంలో అధికారికంగా ఇసుక రీచ్ ఎక్కడా ప్రారంభం కాలేదు. దీంతో ఇసుకాసురులు ఆటలకు అడ్డు లేకుండా పోయింది. చిన్నమంగళాపురంలో ఒక్కొక్క ఇసుక ట్రాక్టరుకు రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. అయితే, ఈ సొమ్ము ఎవరి జేబుల్లోకి వెళ్తుందనేది తెలియడం లేదు. ఇప్పటికైనా అధికారులు దృష్టి పెట్టి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

పరిశీలించాం

చిన్నమంగళాపురంలో ఇసుక రవాణాకు సంబంధించి స్వయంగా పరిశీలించాను. అయితే వంతెనకు 500 మీటర్ల దూరంలోనే ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. ఇసుక తవ్వుకోమని ప్రభుత్వమే ఆదేశాలిచ్చింది. అందువల్ల తవ్వుకుంటున్నారు.

- పి.బాల మురళీక్రిష్ణ, తహశీల్దార్

నేడు గుర్లలో వైసిపి అధినేత జగన్ పర్యటన

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

వైసిపి అధ్యక్షులు, మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గురువారం గుర్లలో పర్యటించనున్నారు. ఇటీవల డయేరియా విజృంభించి 8మంది మరణించిన సంగతి విధితమే. సుమారు 2వందల మంది డయేరియా బారిన పడ్డారు. ఈనేపథ్యంలో జగన్ పర్యటించనున్నారని ఆ పార్టీజిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 11.05గంటలకు ఎస్ఎస్ఆర్‌పేట వద్ద దత్తా ఎస్టేట్‌కు హెలికాప్టర్‌లో జగన్ చేరుకుంటారు. అక్కడి నుంచి గుర్ల గ్రామానికి 11.25 గంటలకు వెళ్తారు. అనంతరం డయేరియా బారిన పడిన కుటుంబాలను, మృతుల కుటుంబ సభ్యులను కలిసి మాట్లాడారు. మధ్యాహ్నం 1గంటకు అక్కడి నుంచి విశాఖ మీదుగా విజయవాడ చేరుకుంటారు.

సత్వర సేవలకు చర్యలు

ఇపిడిసిఎల్ ఎస్ఇ చలపతిరావు

ప్రజాశక్తి-పార్వతీపురం

మన్యం జిల్లాలోని వినియోగదారులకు సత్వర సేవలు అందించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు ఇపిడిసిఎల్ ఎస్ఇ కె.చలపతిరావు చెప్పారు. ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ సత్వర సేవలు అందించడానికే ప్రభుత్వం 1912 కాల్ సెంటర్‌ని ప్రారంభించిందని తెలిపారు. విద్యుత్ శాఖకి సంబంధించిన ఎలాంటి సమస్యనైనా 1912కి ఫోన్ చేసి చెప్పుకోవచ్చునని, వెంటనే పరిష్కారం దొరుకుతుందని వివరించారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, విద్యుత్ స్తంభాలు, వైర్లు కింద వేలాడడం వంటి సంఘటనలు తలెత్తితే కాల్ సెంటర్‌కి ఫిర్యాదు చేయవచ్చునని చెప్పారు. ముందస్తు సమాచారం అందిస్తే ప్రమాదాలు జరగకుండా నివారిస్తామన్నారు. ప్రధానమంత్రి సూర్యఘర్ కార్యక్రమంలో భాగంగా వినియోగదారులంతా సౌర విద్యుత్ సౌకర్యం పొందాలని కోరారు. కిలోవాట్ సౌర విద్యుత్ ఉత్పత్తికి సంబంధించిన పరికరాలు ఏర్పాటు చేసుకుంటే 30వేల రూపాయల సబ్సిడీ, రెండు కిలోవాట్లకైతే రూ.60 వేల సబ్సిడీ, మూడు కిలోవాట్లకైతే రూ.78 వేల సబ్సిడీ లభిస్తుందని చెప్పారు. ఇంటి అవసరాలకు సరిపోగా మిగిలిన విద్యుత్ ప్రభుత్వానికి విక్రయించవచ్చునని తెలిపారు. ఈ పథకం కింద ఇంతవరకు జిల్లాలో 21 మంది దరఖాస్తు చేసుకున్నారని, ఏడుగురికి సౌర విద్యుత్ పరికరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. అడ్డాపుశిల జగనన్న కాలనీకి విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరైందని చెప్పారు. జిల్లాలో సిబ్బంది కొరత పెద్దగా లేదని, అసిస్టెంట్ ఇంజనీర్ల కొరత ఉందని తెలిపారు. జిల్లాలో మొదటి విడతగా కేటగిరీ -2 సర్వీసులకు, ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్లు బిగించనున్నామని వెల్లడించారు. ఎస్‌సి, ఎస్‌టి వినియోగదారులకు 200 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితమని చెప్పారు. పిఎం జన్‌మాన్ కింద పిటిజి గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటామన్నారు.


మాట్లాడుతున్న ఇపిడిసిఎల్ ఎస్ఇ చలపతిరావు

హైరిస్క్ కేసులపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలో రక్తహీనతతో ఉండే గర్భిణులపై, హై రిస్క్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వైద్యాధికారులతో ఆయన సమీక్షించారు. జిల్లాలో ఎటువంటి మాత, శిశు మరణాలు జరగరాదని, ఇందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అన్నారు. హై రిస్క్ కేసులను ముందే గుర్తించి వారికి అవసరమైన వైద్యాన్ని, మందులను అందించాలని చెప్పారు. మాతా శిశుమరణాలకు కారణమయ్యే అధికారులు, సిబ్బంది పట్ల చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్షేత్ర స్థాయిలో పరిస్థితుల పట్ల పూర్తిగా అవగాహన ఉండాలన్నారు. గర్భిణులను ఆసుపత్రిలో చేర్చినప్పుడు సంబంధిత ఆసుపత్రి మంచి వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ప్రతి ఆసుపత్రిలో ఒక నెలలో జరిగిన ప్రసవాలు, అందులో హై రిస్క్ కేసులు విధిగా గుర్తించి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఏ ప్రాంతంలో ఎక్కువ హైరిస్క్ కేసులు ఉంటాయో అటువంటి ప్రాంతాల్లో మరిన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. గర్భిణులను ప్రైవేట్ ఆసుపత్రులకు రిఫర్ చేసినా, ఎఎన్ఎంలు తీసుకువెళ్లినట్లు తమ దృష్టికి వచ్చినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కౌమారదశ ఆడపిల్లలు, గర్భిణులకు రక్తహీనత లేకుండా తీసుకోవలసిన ఆహారం, జాగ్రత్తలు గురించి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని అన్నారు.

జిల్లాలో డెంగీ, మలేరియా, ఫైలేరియా వంటి కేసులు నమోదు కాకుండా కార్యక్రమాలను విస్తృతం చేయాలని చెప్పారు. రక్త నమూనాలను సేకరించి నివారణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామాలలో పారిశుధ్య నిర్వహణలో ప్రజలను భాగస్వామ్యులను చేయాలని, ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని, సీజనల్ వ్యాధులు, పారిశుధ్యం పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. దోమలు వృద్ధి చెందే ప్రదేశాలను గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. మలేరియా, డెంగీ వ్యాధులను గణనీయంగా నివారించాలని, వ్యాధులు వ్యాప్తి కాకుండా పక్కా ప్రణాళికతో ముందడుగు వేయాలని స్పష్టం చేశారు. సికిల్‌సెల్ కార్డులు పంపిణీ పూర్తి చేయాలని, కార్డు ఉపయోగంపై ప్రతిఒక్కరికీ అవగాహన కల్పించాలని తెలిపారు. తరువాత తరంలో సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చెప్పారు. వర్షాల నేపథ్యంలో ఎటువంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో డిఎంహెచ్ఒ కె.విజయ పార్వతి, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.వాగ్దేవి, డిఎల్ఎటిఒ వినోద్ కుమార్, ఇతర వైద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

'జంఝావతి'ని పూర్తి చేయాలి

సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి-కొమరాడ

జంఝావతి ప్రాజెక్టుపై కూటమి నాయకులు గతంలో చెప్పిన విధంగా పనులు పూర్తి చేసేందుకు ముందుకు రావాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి కోరారు. ప్రాజెక్టు పరిసర ప్రాంతాలైన కుమ్మరిగుంట, కందివలసలో మంగళ, బుధవారాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి, జనసేన, బిజెపి నాయకులు కలిసి జంఝావతి ప్రాజెక్టును పరిశీలించి, భవిష్యత్తులో పెండింగ్ పనులు పూర్తి చేసేలా చూస్తామని హామీనిచ్చారని గుర్తుచేశారు. ఒడిశా ప్రభుత్వంతో చర్చలతోపాటు కేంద్ర ప్రభుత్వం నుండి తగిన నిధులు తెస్తామని గుర్తుచేశారు.

వెంటనే ఆ దిశగా చర్యలు తీసుకుని, జంఝావతి ప్రాజెక్టు పనులు పూర్తిచేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి.సింహాచలం, కెవిపిఎస్ నాయకులు పెంటయ్య, రాముడు, ఆదినారాయణ, సిఐటియు నాయకులు సూర్యారావు పాల్గొన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-పాలకొండ

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం సమన్వయంతో కళాశాల ప్రిన్సిపల్ ఎం.శ్యామ్‌బాబు అధ్యక్షతన అంతర కళాశాల వాలీబాల్, కబడ్డీ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా డిఎస్‌పి ఎం.రాంబాబు మాట్లాడుతూ ఇలాంటి క్రీడా పోటీలు ఇక్కడ జరగడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ పోటీల్లో పాల్గొనడం వల్ల విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కె.రేమీ రజనీ మాట్లాడుతూ వివిధ కళాశాలల నుండి కబడ్డీకి పురుషుల విభాగం నుంచి 11, మహిళా విభాగానికి 6, వాలీబాల్ పురుషుల విభాగానికి 17, మహిళా విభాగానికి 5 జట్లు పాల్గొంటున్నట్లు తెలిపారు. మూడు రోజుల పాటు ఈ పోటీలు జరుగుతాయని చెప్పారు. దీనికి ఆర్థిక సహాయం అందించిన మాజీ సర్పంచ్ పల్లా కొండలరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ పి.క్రిష్ణారావు, అంబేద్కర్ యునివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శులు ఎం.శ్రీనివాస్ రావు, ఎ.భాస్కర్‌రావు, ఎంఇఒ కె.సోంబాబు, విశ్రాంతి గ్రంథాలయ అధికారి కె. చౌదరినాయుడు, కళాశాల వైస్ ప్రిన్సిపల్ జయమణి, స్పోర్ట్స్ ఇన్‌ఛార్జి బి.రాజు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఎస్‌పి రాంబాబు

డబ్బులు చెల్లిస్తేనే ఉచితం

- 'సూపర్ సిక్స్' గ్యాస్ సిలిండర్లపై ప్రభుత్వం మెలిక
- పేదల ఆశలపై నీళ్లు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఔను...! సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితంగానే ప్రభుత్వం మంజూరు చేస్తుంది. కానీ, డబ్బులు మాత్రం చెల్లించాలి. అదేంటి ఉచితంగా సిలెండర్లు ఇస్తున్ననప్పుడు డబ్బులు ఎందుకు చెల్లించాలి? అనుకుంటున్నారా..! ఇందులోనే సర్కారు మెలిక ఉంది. ఉచిత సిలెండర్లకు కూడా ముందుగానే డబ్బులు చెల్లించాలట. ఆ తరువాత ఆ మొత్తాన్ని ప్రభుత్వం రియింబర్స్‌గా చెల్లిస్తుందట. దీన్నిబట్టి నగదు బదిలీ పథకంలో భాగంగా గ్యాస్ సిలెండర్లపై పూర్వం నుంచి ఉన్న రాయితీని కేంద్ర ప్రభుత్వం క్రమంగా తగ్గించిన చందంగా ఇందులోనూ ఏదో ఒక మెలిక ఉంటుందని పేదలు భయపడుతున్నారు. ఎన్నికల హామీలో భాగంగా కూటమి ప్రభుత్వం సూపర్-6 పథకాలు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలెండర్ల పథకాన్ని దీపావళి నుంచి అమలు చేస్తామంటూ బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ప్రాథమిక నిబంధనల ప్రకారం తెల్లరేషన్‌కార్డులు ఉన్నవారందరికీ ఈపథకం వర్తించనుంది.

ఈ లెక్కన విజయనగరం జిల్లాలో 5,81,268 మందికి, పార్వతీపురం మన్యం జిల్లాలో 2,81,251 తెల్లరేషన్ కార్డుదారులకు ఈ పథకం అందుబాటు లోకి రానుంది. కానీ, డబ్బులు ముందుగా చెల్లించాలన్న నిబంధన పేదలకు రుచించడం లేదు. ప్రస్తుతం జిల్లాలో గ్యాస్ సిలెండర్ ధర రూ.820 వరకు ఉంది.ఈ మొత్తాన్ని లబ్ధిదారులు ముందుగానే చెల్లించాలి. డబ్బులే ఉంటే ఉచితం కోసం ఎందుకు ఆశపడతామని పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉచితం అన్నాక ఉచింతంగా ఇవ్వాలిగానీ ఇన్ని మెలికలు ఎందుకని జనం ప్రశ్నిస్తున్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం కూడా గ్యాస్ సిలిండర్ ధర మొత్తం చెల్లిస్తే రాయితీ మొత్తాన్ని తిరిగి బ్యాంకు ఖాతాల్లో జమచేస్తామంటూ ప్రకటించిందని, తీరా ఆచరణలో రూ.200 ఉన్న రాయితీని రూ.3 తగ్గించేసిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఉచిత గ్యాస్ సిలెండర్ల మాటా అలాగే ఉందని పేదలు అంటున్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఓపెన్ హౌస్ కార్యక్రమంలో ఎస్‌పి మాధవ్‌రెడ్డి

బుల్లెట్ గురించి విద్యార్థులకు వివరిస్తున్న ఎస్‌పి మాధవ్‌రెడ్డి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్‌పి ఎస్.వి.మాధవరెడ్డి కోరారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక పోలీస్ మల్టీ ఫంక్షన్ హాల్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్‌పి ఎస్.వి.మాధవ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు పట్టణంలోని వివిధ పాఠశాలల, కళాశాల విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌పితోపాటుగా పోలీస్ అధికారులు విద్యార్థులతో మమేకమై, ఆప్యాయంగా మాట్లాడారు. అనంతరం పోలీసుశాఖ విధి నిర్వహణలో ఉపయోగించే వివిధ ఆయుధాలు, అత్యాధునిక పరికరాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించి, వారిలో స్ఫూర్తినింపారు. విన్యాసాల్లో పోలీసు డాగ్స్ చూపిన క్రమశిక్షణ, హ్యాండలర్స్ ఆదేశాలు పాటించే తీరు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎఎస్‌పిలు ఒ.దిలీప్ కిరణ్, అంకిత సురాన, ఎఆర్ డిఎస్‌పి ఎస్.వి.అప్పారావు, ఎఆర్ ఆర్‌ఐలు శ్రీరాములు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న సాలూరు సిఐ అప్పలనాయుడు

సీతానగరం : ఎస్ఐ ఎం.రాజేష్ ఆధ్వర్యంలో చినబోగిలి గ్రామస్తులకు పోలీస్ శాఖపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎఎస్ఐ లంక శ్రీనివాసరావు గ్రామస్తుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది సుజాత, పద్మ, రామకృష్ణ, అప్పలకొండ పాల్గొన్నారు

సాలూరు రూరల్ : నిరంతరం ప్రజల శ్రేయస్సు కోసం పోలీసులు శ్రమిస్తుంటారని పట్టణ సిఐ అప్పలనాయుడు తెలిపారు. బుధవారం సాలూరు పట్టణ సర్కిల్ కార్యాలయంలో స్థానిక విద్యార్థులతో కలిసి స్టేషన్‌లో నిత్యం పోలీసులు నిర్వర్తించే కార్యకలాపాల గురించి అవగాహన కల్పించారు.

సీతంపేట : యువకులు, విద్యార్థులు గంజాయి, గుట్కాలు వంటి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ వై.అమ్మన్నరావు అన్నారు. స్థానిక వైటిసిలో ఉన్న స్కిల్ కాలేజీలో సైబర్ క్రైమ్ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితం నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. మహిళలు, యువతుల భద్రత గురించి అవగాహన కల్పించారు. సైబర్ క్రైమ్ గురించి క్లుప్తంగా వివరించారు. ట్రాఫిక్ నిబంధనల గురించి అవగాహన కల్పించారు. మితిమీరిన వేగంతో వాహనం నడిపితే వచ్చే ప్రమాదాలు గురించి వివరించారు. కార్యక్రమంలో వైటిసి మేనేజర్ వెంకటరమణ, ఎఎస్ఐ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

అదుపులోకి వచ్చిన డయేరియా

ప్రజాశక్తి-గుర్ల

మండలంలోని గుర్ల, గోషాడ, గూడెం, కోటగండ్రేడు, పున్నపురెడ్డి పేట, నాగళ్లవలస, గుజ్జంగివలస, పెనుబర్తి గ్రామాలలో డయేరియా ప్రబలిన డయేరియా అదుపులోకి వచ్చింది. బుధవారం కొత్తగా కేసులు నమోదు కాకపోవడంతో ప్రజలు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. పదిరోజుల క్రితం మండలంలో, ప్రధానంగా గుర్లలో డయేరియా విజృంభించి 9 మంది మృత్యువాత పడిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో అధికారులు గుర్ల, గూడెం, నాగళ్లవలసలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. బుధవారం గూడెంలో వైద్య శిబిరాన్ని ఎత్తివేయగా, నాగళ్లవలసలో వైద్య శిబిరంలో ఒక్కరోగి కూడా లేరు. ఇక్కడ చికిత్స పొందుతున్న వారు కోలుకోవడంతో డిశ్చార్జి చేశారు. ప్రస్తుతం గుర్ల పిహెచ్‌సిలో ఐదుగురు, తెట్టంగి పిహెచ్‌సిలో ఒకరు చికిత్స పొందుతున్నారు. చంపావతి నది నుండి వచ్చిన తాగునీటిని నిలుపుదల చేసి, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయడంతో వ్యాధి అదుపులోకి వచ్చిందని అధికారులు భావిస్తున్నారు. కొత్త కేసులు నమోదు కాకపోవడంతో ఊపిరి పీల్చుకుంటున్నారు.

నేడు హోంమంత్రి అనిత రాక

గుర్లలో పర్యటన.. అధికారులతో సమావేశం

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత గురువారం జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వెల్లడించారు. మధ్యాహ్నం ఒంటి గంటకు నగరానికి చేరుకొని మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు నివాసానికి వెళ్తారని, అక్కడనుండి జెడ్‌పి అతిథి గహం చేరుకుంటారని తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు గుర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులను పరామర్శిస్తారని తెలిపారు. మధ్యాహ్నం 3.20 గంటలకు కలెక్టర్ కార్యాలయం చేరుకొని గ్రామీణ నీటి సరఫరా, వైద్య ఆరోగ్య, పంచాయతీరాజ్ అధికారులతో సమీక్షిస్తారని పేర్కొన్నారు. సాయంత్రం నాలుగు గంటలకు కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు అధికారులతో పలు అభివృద్ధి అంశాలపై సమీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు.

స్వల్పకాలిక శిక్షణకు దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి-సీతంపేట

ప్రధానమంత్రి కౌసల్య వికాస్ యోజన సారథ్యంలో స్కిల్ హబ్ ఇనిషియేటివ్ ప్రోగ్రాం ద్వారా సీతంపేట ప్రభుత్వ ఐటిఐలో ఉచిత స్వల్పకాలిక శిక్షణ కోర్సులు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఫోర్ వీలర్ సర్వీస్ అసిస్టెంట్ టెక్నీషియన్, తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయని ఐటిఐ ప్రిన్సిపల్ ఎం.గోపాలకృష్ణ, డిఎస్‌డిఒ సాయికృష్ణ చైతన్య తెలిపారు. ఈ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. శిక్షణ పూర్తయ్యాక ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 7993795796 నంబరును సంప్రదించాలని కోరారు.

అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

మండలంలోని వెంకంపేట క్రీడా మైదానంలో బుధవారం జిల్లాస్థాయి అండర్-14 బాల బాలికల అథ్లెటిక్స్‌లో క్రీడాకారుల ఎంపిక చేపట్టారు. 60 పాఠశాలల నుండి 250 మంది క్రీడాకారులు హాజరయ్యారు. 10 ఈవెంట్లకు గాను ఈ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జిఎఫ్ కార్యదర్శి ఎం.మురళీ తెలిపారు. ఎంపికైన వారు రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్తారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు ఎం.వాసుదేవరావు, పి.చంద్రమోహన్, బి.వెంకట్రావు, కోఆర్డినేటర్లు ఎస్.మురళి, చక్రధారి, ఆనంద్, విజయనగరం జిల్లా అధ్యక్షులు ఎన్.వెంకట్ నాయుడు, శ్రీను, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత తప్పనిసరి

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

మండలంలో చేపట్టే అభివృద్ధి పనులు నాణ్యతగా ఉండాలని ఎంపిడిఒ కె.రూపేష్ కుమార్.. కార్యదర్శులు, ఇంజినీరింగ్ సహాయకులను ఆదేశించారు. బుధవారం తన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామసభల ద్వారా ఉపాధి నిధులతో నిర్మించే రహదారులు, కాలువలు, గోకులాలు కాకుండా ఆర్థిక సంఘం నిధులతో గ్రామాలలో చేపట్టబోయే పనులు గ్రామం ఉనికిని చాటుతూ, పంచాయతీల ఆస్తిని పెంచేటట్లుగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎఒ రమణమూర్తి, మండల ఇంజినీరింగ్ అధికారి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభకు 17 దరఖాస్తులు

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని శ్రీహరిపురం విక్రమపురంలో బుధవారం తహశీల్దార్ సిహెచ్.సత్యనారాయణ ఆధ్వర్యంలో భూముల రీసర్వే గ్రామసభ నిర్వహించారు. గ్రామసభకు 17 దరఖాస్తులు వచ్చినట్లు తహశీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భూ సర్వే డిటి జి.ప్రసాద్, విఆర్ఒ, రైతులు పాల్గొన్నారు.

నేడు బొడ్లపాడులో గ్రామసభ

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని రేగులపాడు సచివాలయ పరిధిలోని బొడ్లపాడు గ్రామంలో గురువారం రీసర్వే గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు స్వదినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఎఒపై సభ్యుల గరం.. గరం

పనితీరు మారకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరిక

మండల వ్యవసాయాధికారిని నిలదీస్తున్న ఎంపిపి శెట్టి పద్మావతి

ప్రజాశక్తి - కురుపాం

పనితీరు మార్చుకోకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని మండల వ్యవసాయాధికారి కె.నాగేశ్వరరావుపై ఎంపిపి శెట్టి పద్మావతి, ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వ్యవసాయ శాఖ కార్యక్రమాలను ప్రజాప్రతినిధులకు కనీస సమాచారం అందించకుండా ఎఒకు నచ్చినట్టు వ్యవహరించడం సమంజసం కాదని ఎంపిపి మండిపడ్డారు. గత మూడు సమావేశాల నుండి చెబుతున్నా ఇదే తంతుగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎఒ తీరుతో రైతులు నష్టపోతున్నారని, ఇప్పటికైనా పని తీరు మార్చుకోకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. సర్పంచికే సమాచారం లేకున్నా అభివృద్ధి పనులపై ప్రతిపాదనలు పంపించడం ఎంతవరకు సమంజసమని అధికారులను ప్రశ్నించారు.

అనంతరం గుజ్జువాయి సర్పంచ్ నాగేశ్వరరావు, పెదగొత్తిలి సర్పంచ్ లోకనాథం మాట్లాడుతూ మండలంలో 330 గ్రామాలుంటే, 150 టార్పాలిన్లు వస్తే ఎలా? అని నిలదీశారు. ప్రస్తుతం వ్యవసాయ పనుల నిమిత్తం ప్రతీ రైతుకు టార్పాలిన్ అవసరమని, అలాంటిది ప్రతిపాదనలే సక్రమంగా పంపించకపోతే రైతులకు మీరేమి సబ్సిడీ పథకాలు అందిస్తారని ఎఒను ప్రశ్నించారు. ఎంఇఒ ఎన్.సత్యనారాయణ మాట్లాడినప్పుడు మొండెంఖల్ సర్పంచ్ ఐ.గౌరీశంకర్ తమ గ్రామంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల త్వరగా పూర్తిచేసి విద్యార్థులకు వసతి సదుపాయం కల్పించాలని కోరారు. కనీసం తమకు సమాచారం తెలియకుండా పంచాయతీ కార్యదర్శులు ప్రతిపాదనలు పంపిస్తున్నారని పలువురు సర్పంచులు ఇఒపిఆర్‌డి రమేష్‌బాబు దృష్టికి తీసుకొచ్చారు. ఆయన స్పందిస్తూ పంచాయతీ నుంచి ఎటువంటి ప్రతిపాదన పంపించాలన్నా సర్పంచులకు తెలియకుండా చేయడానికి వీల్లేదని స్పష్టంచేశారు. కార్యదర్శులకు చెప్పి సమస్యను పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అంగన్వాడీ కేంద్రాలు కొన్ని పాడై పెచులూడుతున్నాయని, వాటికి మరమ్మతులు చేపట్టాలని పలువురు ప్రజాప్రతినిధులు ఐసిడిఎస్ అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి, తహశీల్దార్ ఎం.రవణమ్మ, జెడ్‌పిటిసి జి.సుజాత, వైస్ ఎంపిపిలు అన్నాజీరావు, రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి-సీతంపేట

గిరిజన గ్రామాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు ఎం.తిరుపతిరావు డిమాండ్ చేశారు. మండలంలోని మర్రిపాడు పంచాయతీ పరిధిలోని ఎగువదారబంధం, నడిమి దార బంధం, దిగువదార బంధం గిరిజనులతో గిరిజన సంఘం నాయకులు ఎం.లక్ష్మణరావు అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మూడు గ్రామాల్లో 80 కుటుంబాలు ఉన్నాయని, నేటికీ అక్కడ రక్షిత తాగునీరు అందడం లేదన్నారు. అందుకు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారుల నిర్లక్ష్యమే కారణమన్నారు. రేగులపాడు నుంచి దిగువదారబంధం గ్రామానికి ఐదు కిలోమీటర్ల దూరంలో పంచాయతీరాజ్ శాఖ 2021లో 3 కిలోమీటర్ల రోడ్డు నిర్మించిందన్నారు. మిగిలిన రెండు కిలోమీటర్ల రహదారిని వదిలేశారని చెప్పారు. దీంతో మూడు గ్రామాల ప్రజలకు ఎటువంటి ప్రయోజనమూ లేదని స్పష్టంచేశారు. ప్రజలు అవసరం తీర్చడానికి కాకుండా తుతూ మంత్రంగా ప్రభుత్వం పనులు చేస్తోందని విమర్శించారు. నేటికీ చిన్నపాకలో పాఠశాల నడుస్తుందని తెలిపారు. ఐటిడిఎ అధికారులు వెంటనే స్పందించకపోతే గిరిజనులతో ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

ఓటర్లుగా నమోదు కావాలి

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

అర్హులైన ఉపాధ్యాయులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలని ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లా బాలకృష్ణారావు కోరారు. బుధవారం పార్వతీపురం పట్టణంలోని పలు పాఠశాలను సందర్శించి, ఓటరు నమోదుకు నియమ నిబంధనలు తెలిపారు. నవంబరు ఆరో తేదీలోగా దరఖాస్తులను సంబంధిత తహశీల్దారు కార్యాలయాలకు అందజేయాలని కోరారు. ఈ పర్యటనలో ఉమ్మడి విజయనగరం జిల్లా గౌరవ అధ్యక్షులు బంకులు జోగినాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు వలిరెడ్డి ప్రమీల, నాయకులు పడాల రమేష్ పాల్గొన్నారు.

రైతులు ఆన్‌లైన్ మార్కెటింగ్ చేయాలి

పాచిపెంట.. రైతులకు మట్టి నమూనా పరీక్షల కార్డులతో రైతులు

ప్రజాశక్తి-పాచిపెంట

రైతులు తమ ఉత్పత్తులను ఆన్‌లైన్ మార్కెటింగ్ చేసే స్థాయికి ఎదిగి లాభాలను పొందాలని వ్యవసాయ శాఖ ఎడి ఎం.మధుసూదన్‌రావు తెలిపారు. మండలంలోని కోస్టవలస, మంచాడవలస గ్రామాల్లో ఏర్పాటు చేసిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు నాణ్యమైన ఆహార పంటలను పండించినప్పుడు ఆన్‌లైన్ మార్కెటింగ్ ద్వారా తమ ఉత్పత్తులు విక్రయించుకుని అధిక లాభాలను పొందవచ్చని, ఈ దిశగానే ప్రభుత్వం ఆలోచనలు సాగిస్తుందని తెలిపారు. ప్రస్తుతం ఆహార ధాన్యాలను విచక్షణా రహితంగా ఎరువులు, పురుగు మందులు వేసి పండించడం వల్ల సాగు ఖర్చులు పెరుగుతున్నాయని చెప్పారు. అంతే కాకుండా చీడ పీడల ఉధృతి పెరిగి దిగుబడులు కూడా తగ్గుతాయని తెలిపారు. యూరియాను ఎక్కువగా వాడకూడదని చెప్పారు. రైతులు భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడుకోవాలని, మొత్తం ఎరువును దమ్ములో వేసుకోవాలని సూచించారు. యూరియాను వరి పంటకు మూడు దఫాలుగా, పొటాష్ రెండుసార్లు వేసుకోవాలని సూచించారు. అనంతరం క్షేత్ర సందర్శన నిర్వహించి, మట్టి నమూనా పరీక్ష ఫలితాల విశ్లేషణ కార్డులను రైతులకు అందించారు. ఈ కార్యక్రమంలో కోస్టవలస సర్పంచ్ చెల్లూరు సీతారాం, మంచాడవలస సర్పంచ్ సావిత్రి, ఎఒ కె.తిరుపతిరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు వినోద్ కుమార్ పాల్గొన్నారు.

కొమరాడ : రైతులకు పంటలు, తెగుళ్లపై అవగాహన ఉండాలని జిల్లా రైతు శిక్షణ కేంద్రం అధికారి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండలంలోని చంద్రంపేట, పరశురామ పురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వరి పంట పొలాలను ముందుగా పరిశీలించారు. అనంతరం రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం వరి చిరు పొట్ట దశ నుంచి పంట ఈనిన దశలో ఉందని తెలిపారు. ఈ సమయం రాత్రి పూట ఉష్ణోగ్రతలు ఎక్కువ ఉంటే వరిలో దోమపోటు అధికంగా వస్తుందన్నారు. రైతులు జాగ్రత్తగా ఉండాలని, దీని నివారణకు పైమెట్రోజైన్ ఎకరానికి 120 గ్రాములు, 200 లీటర్లలో కలిపి పిచికారీ చెయ్యాలని చెప్పారు. డెనోటెపురాన్ 80 గ్రాములు ఎకరానికి పిచికారీ చెయ్యాలని, యూరియా అధిక మొత్తంలో ఒకేసారి వెయ్యరాదని రైతులకు అవగాహన కల్పించారు. పొటాష్ ఎరువులు తప్పనిసరిగా వేసుకోవాలని సూచించారు. రైతులు వరి పంట తరువాత భూమి ఖాళీగా వదలకుండా పెసర లేదా మినుము వంటి పంటలను సాగు చెయ్యాలన్నారు. లేకుంటే మొక్కజొన్న పంట వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఒ శంకర్రావు, సిబ్బంది, రైతులు ఉన్నారు.

సీతంపేట.. రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ శ్రీదేవి

సీతానగరం.. రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ అవినాష్

సీతంపేట : మండలంలో కుడ్డపల్లి, కుసిమిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఎఒ పి.శ్రీదేవి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితుల గురించి అవగాహన కల్పించారు. ఈ ప్రాంతంలో ఏ వరి విత్తనాలు బాగా దిగుబడి వస్తుందనే దానిపై వివరించారు. పైరు ఏపుగా పెరగడానికి యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. కలుపు మొక్కలు తొలగించాలని చెప్పారు. అనంతరం రైతులకు వ్యవసాయ పద్ధతుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సింహబలుడు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని చినబోగిలి, తామరఖండి గ్రామాల్లో ఎఒ అవినాష్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా పంటల్లో తెగుళ్లపై అవగాహన కల్పించారు. డిఆర్‌సి ఎడి భారతి మాట్లాడుతూ వరి పంటలో మెలకువలు తెలిపారు.

సభ్యత్వ నమోదుతో భరోసా

ఎమ్మెల్యే విజయ్‌చంద్ర

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్‌చంద్ర

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

టిడిపి సభ్యత్వంతో ప్రతీ కార్యకర్తకు భరోసా ఉంటుందని, సభ్యత్వం తీసుకుంటే రూ.5 లక్షల ప్రమాద బీమా అందిస్తామని ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర అన్నారు. బుధవారం పార్వతీపురం లయన్స్ కళ్యాణ మండపంలో నిర్వహించిన క్లస్టర్ యూనిట్ బూత్ ఇన్‌ఛార్జుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 100 రూపాయలతో సభ్యత్వం తీసుకుంటే రూ.5 లక్షలు ప్రమాద బీమా వర్తిస్తుందని చెప్పారు. రూ.10 వేలను మట్టి ఖర్చుల కింద పార్టీ అందిస్తుందని తెలిపారు. నాయకులందరూ ఐక్యంగా పనిచేసి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఎవరైనా పార్టీకి నష్టం కలిగించేలా ప్రయత్నిస్తే మాత్రం తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

శరవేగంగా తాగునీటి పథకం పనులు

ప్రజాశక్తి-వీరఘట్టం

మండల కేంద్రంలోని బిసి కాలనీ వద్ద రక్షిత మంచినీటి పథకం పనులు శరవేగంగా సాగుతున్నాయి. రూ.53 లక్షల అంచనా వ్యయంతో గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో సుమారు నాలుగు లక్షల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకు పనులు చేపడుతున్నారు. రక్షిత మంచినీటి పథకం నిర్మాణంతోపాటు ఇంటింటి కుళాయి పాయింట్లు ఏర్పాటు చేసేందుకు పైప్ లైన్లు, బోరుబావి తవ్వకాలు కూడా చేపట్టినట్లు అధికారులు తెలిపారు. పనులు పూర్తయితే దాదాపుగా వీరఘట్టంలో తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని అభిప్రాయ పడ్డారు.

నిర్మాణంలో ఉన్న రక్షిత మంచినీటి పథకం ట్యాంకు